# అద్దంలో చందమామ

-కె. ప్రవీణ

అమెరికాలో స్థిరపడ్డ రాధిక చాన్నాళ్ళ తర్వాత తన మనవరాలితో బాటు ఇండియాకి వచ్చింది. ఎయిర్ పోర్టులో వాళ్ళని రిసీవ్ చేసుకోవడానికి ఆమె పిన్నిగార బ్బాయి శేఖర్ వచ్చాడు.

రాధికను చూస్తూనే "నువ్వు చాలా మారావక్కా మొదట గుర్తు పట్టలేదు తెలుసా" అన్నాడు. ఆమె పక్కన అరవిరిసిన తెల్లగులాబీలా ఉన్న అమ్మాయి వంక చూస్తూ "పవన్ కూతురు కదూ... అంతా నీ పోలికే... చనువుగా చేతిలోని బ్యాగేజీ ట్రాలీని తన చేతిలోకి తీసుకుంటూ "నీ పేరేమిటమ్మా..." అడిగాడు.

"శావీ" సన్నటి స్వరంతో నాజూగ్గా పలికింది.

"దాని పూర్తి పేరు సావిత్రి. అమ్మ పేరు పెట్టాన్రా శేఖర్. ఇది అమ్మ పోయిన నెలలోపే పుట్టింది. అమ్మే వచ్చిందనుకున్నా... అక్కడి వాళ్ళ నోళ్ళల్లో 'సేవిత్రీ'.. సావీ ఇలా మారుతూ ఆఖరికా పేరు అమెరికన్ స్లాంగ్‌లో 'శావీ'గా స్థిరపడింది" అన్నది నవ్వుతూ.

వాళ్ళలా మాట్లాడుకుంటూ ఏర్‌పోర్ట్ బయటికి వచ్చారు.

డ్రైవరు కారు ట్రంక్‌లో లగేజ్ సర్దాడు.

ఇక్కడి నుంచి సరాసరి ఊరెళ్ళాలని ఫోన్లో చెప్పావు. అంత తొందరేమిటక్కా... ఇక్కడ ఓ రెండ్రోజుల పాటు ఉండి వెళ్ళకూడదూ...

"వద్దు శేఖర్, టైం చాలా తక్కువగా ఉంది. ముందుగా ఊరెళ్ళాలి. సమయం ఉంటే ఆపై తిరుగు ప్రయాణంలో నీ దగ్గర ఉంటాన్లే" అన్నది.

అందరూ కార్లో కూచున్నారు.

ఇంతలో రాధిక హ్యాండ్ బ్యాగ్‌లో ఉన్న సెల్ మోగింది. రాధిక ఫోన్ తీసింది.

"హలో, మమ్మీ ఫ్లైట్ ఎక్కడా డిలే అవకుండా సమయానికే చేరింది కదా...! థాంక్ గాడ్... నేను చాలా కంగారుపడ్డాను. జర్నీలో నువ్వు బాగా అలిసి పోయి ఉంటావు. ఈ ఒక్క రోజన్నా శేఖర్ మామయ్య ఇంట్లో విశ్రాంతి తీసుకొని రేపు ఊరి ప్రయాణం పెట్టుకోకూడదూ... అభ్యర్థిస్తున్నట్లుగా అంటున్నాడు పవన్.

అవతలి నుండి మాట్లాడుతున్న అతనికి సమాధాన మేమీ ఇవ్వకుండా మౌనంగా ఉండిపోయింది రాధిక.

.....

మమ్మీ... కెన్ యూ హియర్.. మీ...?

.....

మా..మ్... పవన్ ఆదుర్దాతో బిగ్గరగా అరిచాడు.

... ఉన్నాను పవన్... నువ్వు చెప్పేది వినబడు తూంది. విషయమంతా తెలిసీ నువ్వు మళ్ళీ మళ్ళీ అదే మాట చెబుతుంటే ఏం మాట్లాడాలో తెలియ లేదు... ముందుగా ఊరెళ్ళి రానీ, ఆపై అంతా విశ్రాం తేగా... అలా అంటూన్నప్పుడు రాధిక పెదాలపై భావం తెలియని విచిత్రమైన చిరునవ్వు కదలాడింది.

మమ్మీ... ఒక్కసారి శేఖర్ మావయ్యకి ఫోన్ ఇవ్వు. అసలు విషయమేమిటో చెబుతాను...

"వద్దు పవన్..."

"మమ్మీ, వాళ్ళకా విషయం అకస్మాత్తుగా తెలిస్తే షాక్ అవుతారు. నన్ను మావయ్యతో మాట్లాడనివ్వు.. బతిమాలుతున్నట్లుగా అన్నాడు.

"పవన్ నేను నీకు అన్నీ వివరంగా చెప్పే వచ్చా ను.. కదా. మళ్ళీ ఈ వాదనంతా ఎందుకు, ఈ విష యాన్ని ఇక్కడితో వదిలెయ్యి.. నేను నీతో తరువాత మాట్లాడతాను.. ఫోన్ స్విచ్చాఫ్ చేసిందామె.

శేఖర్‌కి విషయమేమిటో అర్థం కాలేదు.

"ఏంటక్కా ఏమంటున్నాడు పవన్..."

"శావీ'కి ఈ వాతావరణం సరిపడుతుందో లేదోనని కంగారు పడుతున్నాడు అన్నది తేలిగ్గా నవ్వేస్తూ.

రాధిక చెప్పింది శేఖర్‌కి నమ్మదగ్గదిగా అన్పించ లేదు. అతనింకేదో అడగబోయేంతలో రాధిక మాట మార్చింది.

"శేఖర్ హార్డీకర్ బాగ్ వీధిలో అప్పట్లో మేముండే ఇంటికి వెళ్దాం" అన్నది.

"ఆ ఇల్లు పెదనాన్న ఎప్పుడో అమ్మేశారు కద అక్కయ్యా... ఇంకా ఏముందక్కడ...?"

"నాకొక్కసారి ఆ ఇల్లు చూడాలని ఉందిరా..." అన్నది. అలా అంటున్నప్పుడు ఆమె కంఠంలో జీర వినిపించింది. శేఖర్ ఏదో చెప్పాలనుకొని రాధిక ముఖం వంక చూసి ఆగిపోయాడు. డ్రైవరుతో హిమాయత్‌నగర్ వైపు కారు పోనివ్వమన్నాడు.

"హిమాయత్‌నగర్ అన్నావేమిటి... మనం వెళ్ళా

ల్సింది హార్డీకర్ బాగ్ కదా...!"

"ఇప్పుడా వీధికి హిమాయత్‌నగర్ అని పేరు మారిందిలే అక్కా ఆ రోజుల్లో హార్డీకర్ కుటుంబీకులకు చెందిన తోటలూ, ఇళ్ళూ అక్కడ ఉండటం వల్ల అప్పట్లో అలా అనేవాళ్ళు. ఇప్పుడా తోటలనూ, పెద్ద ఇళ్ళ స్థలాలనూ చిన్న చిన్న ప్లాట్లు చేసి అమ్మారు. ఇప్పుడా ఇంటి ఛాయలేవీ లేవక్కడ" అన్నాడు శేఖర్.

శేఖర్ మాటలు వింటూ కదులుతూన్న కార్లోంచి రోడ్లను గమనించసాగింది. సిటీ గుర్తు పట్టలేనంతగా మారింది. ఇప్పుడు హైదరాబాద్‌లోనూ ఆనాటి బాంబే మాదిరిగా అపార్ట్‌మెంట్ కల్చర్ వచ్చేసింది. ఎక్కడబడితే అక్కడ మల్టీ స్టోరీడ్ బిల్డింగ్స్ పుట్టగొడుగుల్లా లేచాయి. రోడ్లపైన ట్రాఫిక్ కూడా విపరీతంగా పెరిగినట్లుంది. ఇంటర్నెట్ ద్వారా, టివిల్లోనూ, టెలిఫోన్ సంభాషణల వల్లా రాధికకు ఈ మార్పు పట్ల కొంతమేరకు అవగాహన ఉంది. అయినా కూడా ఆమె ఊహకందని ఆ మార్పుని ప్రత్యక్షంగా చూస్తూ ఆశ్చర్యానికి లోనైంది.

తాను పుట్టి పెరిగిన గడ్డ మీద కాలు మోపి ఎన్నేళ్ళయింది...? 'అమ్మ' ఆఖరి క్షణాల్లో ఉందన్న కబురు తెలిసినప్పుడు వచ్చింది. అమ్మ పోయి పదిహేడేళ్ళు అవుతూంది. అప్పుడు వచ్చి వెళ్ళిన తను మళ్ళీ ఇదే తిరిగిరావడం. తాను పుట్టి పెరిగిన ఈ దేశంలో పదిహేడేళ్ళ తర్వాత కాలు మోపుతూంది. తన పుట్టింట్లోనూ, అమ్మమ్మ గారింట్లోనూ వదిలి వెళ్ళిన బాల్య స్మృతులను ఏరుకొని వాటిలోని మాధుర్యంతో మనసు నింపుకోవాలనే ఆకాంక్షతో ఈనాడిలా తిరిగి వచ్చింది. రాధిక ఆలోచనలకు బ్రేక్ వేస్తున్నట్లుగా కారు ఆగింది. ఆగిన కార్లోంచి బయటకు చూస్తూ "అదేమిటి... ఇక్కడెందుకు ఆగాము" అన్నది రాధిక అక్కడ ఉన్న అపార్ట్‌మెంట్స్ వంక ఆశ్చర్యంగా చూస్తూ.

"అప్పట్లో మీరు ఇక్కడే ఉండేవారు. పెదనాన్న దగ్గర ఈ ఇల్లు కొన్నవాళ్ళు అప్పటి పాత ఇంటిని పడగొట్టి ఈ అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్ కట్టారు. ఈ స్థలం సిటీ మధ్యలో ఉంది, స్కూళ్ళకూ, కాలేజీలకూ, సినిమా థియేటర్‌లకూ సెంటర్‌లా ఉండే ప్రదేశం కాబట్టి ఇక్కడ అపార్ట్‌మెంట్లకి డిమాండ్ బాగా ఉంది.. శేఖర్ చెప్పుకు పోతున్నాడు.

తండ్రి ఆ ఇల్లు అమ్మడం రాధికకు తెలిసిన విషయమే అయినా ఆనాటి తన అమూల్యమైన జ్ఞాపకాల నిధిని నిక్షిప్తం చేసుకున్న ఆ ఇంటి స్థానంలో నేడీ మల్టీ స్టోరీడ్ బిల్డింగ్ కట్టబడి ఉండటం ఆమె మనసెందుకో

# నవ వసంత ఆగమ వేళ..

**మా**ర్చి 2006 మన మాసపత్రిక యిప్పుడు మీ చేతిలో వుంది. తెలుగు సంవత్సరాది వసంత వైభవాలతో మార్చి 30న రావడానికి అలంకరించుకుంటోంది. వేపపూతలు, మామిడి పిందెలు, జాతక ఫలితాలు ఉగాది ఉత్సవాన్ని మన నట్టింటికి తీసుకు వచ్చే శుభ తరుణం యిది.

వచ్చేది "వ్యయ" నామ సంవత్సరం. పేరును చూసి మనం అలజడి చెందాల్సిన అగత్యం లేదు. ఆదాయంతో పాటు వ్యయం కూడా వున్నపుడే ఆనందం! వ్యయం వృధా వ్యయం కానంతవరకు సమస్య లేదు. చదువు సంధ్యలకు, పెళ్లి పేరంటాలకు అయే వ్యయం సార్ధకమైంది. వ్యయ నామ సంవత్సరంలో అందరికీ శుభప్రదమైన ఖర్చులే వుంటాయని ఆశిద్దాం. పత్రిక మన మాసపత్రిక వ్యయ ఉగాది సంచిక, మార్చి 25 తేదీకి విడుదల అవుతుంది. నూతన సంవత్సరానికి స్వాగతం పలకడానికి ఒక వారం ముందే రావడానికి వుత్సాహ పడుతోంది. తేనెలొలికే తెలుగు భాష నేడు వార్తలలో వుంది. మన భాష సంస్కృతిల ప్రాచీనతను నిర్ధారించి, నిరూపించాల్సిన అగత్యం ఏర్పడింది. ఈ వుద్యమానికి పలువురు భాషాభిమానులు మహాసంకల్పంతో రంగ ప్రవేశం చేశారు. పత్రిక- మన మాసపత్రిక కూడా మాతృభాషకు తనవంతు సేవలను అందించడానికి పునరంకితం అవుతూంది. ఉగాది సంచిక ప్రత్యేక కవితలతో, కథలతో మావిచిగురుల పరిమళాలతో మీ ముందుకు వస్తుంది. పేజీలు, సైజు, వెల వగైరాలలో మార్పు వుండదు.

కవులు, కథకులు, వ్యాసకర్తలు వాతావరణానికి అనువుగా స్పందించి, స్ఫూర్తిదాయకమైన రచనలు పంపి ఉగాది పత్రిక శోభస్కరంగా రూపొందడానికి సహకరిస్తారని ఆశిస్తున్నాము.

**చక్కని చిక్కని రచనలు పంపడం మీవంతు**
**వాటిని వినమ్రంగా పాఠకులకు పంచడం మావంతు**
**సర్వే జనాః సుఖినో భవంతు!**

పత్రిక-మన మాసపత్రిక
సంపాదకవర్గం

జీర్ణించుకోలేకపోతుంది.

అన్యమనస్కంగానే శేఖర్ చెప్పేది వింటూ ఆ వీధంతా కలియజూసింది. అప్పట్లో ఆ వీధిలో ఉండే ఇళ్ళన్నీ పడగొట్టి పెద్ద పెద్ద కాంప్లెక్సులు కట్టారు. ఆ ప్రాంతం గుర్తుపట్టలేనంతగా మారింది.

ఏవీ ఆనాటి జ్ఞాపకాలు.. కాంక్రీటు కాలమ్స్ కింద పడి నలిగిపోయాయా... రాధిక కళ్ళ ముందు లీలగా అప్పటి దృశ్యాలు కదలాడాయి. సుమారు రెండువేల చదరపు గజాల స్థలం మధ్యలో ఉండే విశాలమైన ఇల్లు, ఇంటి ముందు ఉండే పెద్ద పొగడ చెట్టు, పెరట్లో ఉండే మల్లెపందిరీ, గున్నమామిడి చెట్టూ, జామచెట్టూ ఏవీ...? ఏమైపోయాయి...? వేపచెట్టు కింద ఉండే అరుగుపైన అమ్మ ఒడిలో తల వాల్చి పడుకొని తనూ, అన్నయ్యా ఎన్నెన్ని కథలు వినేవారో...? ఏదీ ఆ అరుగు... ఏ బుల్డోజర్ పాలబడి విరిగి ముక్క లయ్యిందో?

రాధిక కళ్ళల్లో పలుచటి నీటి తెర కదలాడింది.

ఆ భవనం గోడల్లోంచి 'రాధీ...' అంటూ అమ్మ పిలుపు వినిపించింది.

"రాధీ... జాగ్రత్త... పడిపోతావు" సావిత్రమ్మ గొంతు మార్మోగినట్లన్పించింది రాధిక మనసుకు.

అన్నయ్యతో బాటుగా జామ చెట్టెక్కి కాయలు కోయాలనుకున్నప్పుడల్లా వెన్నంటి వచ్చే అమ్మ తనను పడిపోతావని హెచ్చరించేది. చెట్టెక్కకుండా ఆపేది.

"అన్నయ్య చెట్టెక్కితే ఏమీ అనవు, నన్నెందుకు ఎప్పుడూ వద్దంటావు" అంటూ మారాం చేసేది.

"రాధీ, చూడు వాడస్తమానం అలా చెట్టెక్కడం వల్ల కాళ్ళూ, చేతులూ గీసుకుపోయి ఎలా తయార య్యాయో చూడు. కింద పడిపోయినప్పుడు అయిన గాయాల తాలూకు మచ్చలు ఎలా కనబడుతున్నాయో చూడు...? వాడంటే మగపిల్లాడు. నువ్వు ఆడపిల్లవి. సుకుమారంగా ఉండే నీ శరీరానికి గాయాలైతే మచ్చ లెంత అసహ్యంగా కనబడతాయో తెలుసా... అని బుజ్జగించేది.

అప్పట్లో అక్కడ వీధులన్నీ నిర్మానుష్యంగా ఉండేవి. ఎక్కడో ఒకటీ, అర వాహనాలు తిరిగేవి. తనూ అన్న య్యా సైకిల్ మీద ఎలాంటి ఆటంకాలు లేకుండా వీధిలో హాయిగా తిరిగేవాళ్ళు. అన్నయ్యతో పాటు తనలా సైకిల్‌పై తిరగటం అమ్మకస్సలు ఇష్టం ఉండేది కాదు. అమ్మ కన్నుగప్పి అన్నయ్యని బతిమాలి వాడి కూడా సైకిల్‌పై చక్కర్లు కొట్టి గప్‌చుప్‌గా ఇంట్లోకి వచ్చేది. ఒకసారి ఇద్దరూ సైకిల్ బ్యాలెన్స్ తప్పి కిందపడ్డారు. ఇద్దరికీ మోకాళ్ళు, మోచేతులకు గాయా లయ్యాయి. తనకైతే బాగా రక్తం కూడా వచ్చింది. భరించలేనంత నొప్పి కలిగింది. అప్పుడు తెలిసి వచ్చింది తనకి అమ్మ వద్దన్న పని చేయగూడదని. అమ్మ రాసిన మందు వల్ల గాయం త్వరలోనే మానినా దాని తాలూకు మచ్చ మాత్రం చాలా రోజులు ఉండి పోయింది. పాత జ్ఞాపకాల్లో లీనమయి ఉన్న రాధిక చెయ్యి అప్రయత్నంగా మోకాల్ని తడిమింది.

ఆమె స్మృతిపథంలో మరో జ్ఞాపకం మెదిలింది. తమ ఇంటికెదురుగా ఇటిక్యాల సత్యనారాయణరావు గారి ఇల్లు ఉండేది. వాళ్ళు ఇటిక్యాల రాజవంశీకులు. వీధి మలుపులో నుండి ఇంటివరకూ రెండు మూడు చోట్ల 'ఇటిక్యాల వారి మార్గము' అని రాసి ఉన్న దిమ్మెలు బాణంగుర్తుతో దారి తెలుపుతూ ఉండేవి. ఆనాడు వారి పరపతి, హోదా అలాంటిది. తనూ, అన్నయ్యా సాయంకాలాలు వాళ్ళ పిల్లలతో ఆడుకోవడానికి వాళ్ళింట్లోకి వెళ్ళేవాళ్ళు. ఆ ఇంటి పెరట్లో రకరకాల పూలమొక్కలుండేవి. ఇటిక్యాల సత్యనారాయణరావు గారి భార్య రుక్మిణీదేవి చామంతుల సీజన్లో వారమ్మాయి రాగిణితో పాటు రాధికకీ పచ్చచామంతులు పూలజడ కుట్టేవారు. ఎండాకాలంలో సాయంకాలాలు గచ్చుపై చాపలు పరచి మల్లెపూలు రాశులుగా పోసి ఇద్దరు ముగ్గురాడవాళ్ళు మాలలు కట్టేవాళ్ళు. తను సాయం కాలం వాళ్ళింటికి వెళ్ళినప్పుడు ఒక మల్లెమాల తన జడలో తురిమి మరో మాల మీ అమ్మకివ్వు అని తన చేతికిచ్చేవారు. అప్పట్లో తన జడ బారుగా ఉండేది. రాధిక ఒక్కసారి మెడల వరకూ కట్ చేసి ఉన్న బాబ్డ్ హెయిర్‌ని తడిమి చూసుకుంది.

ఒకరోజు సత్యనారాయణరావు గారి పెద్దబ్బాయి ... అతని పేరు... ఆఁ... శ్రీధర్... తనని గదిలోకి తీసుకెళ్ళి 'రాధీ' నువ్వు చాలా ముద్దుగా ఉంటావు" అంటూ తన బుగ్గపై గట్టిగా ముద్దుపెట్టుకున్నాడు. తనకప్పుడు పన్నెండేళ్ళుండేవి... అతనలా హత్తుకొని ముద్దుపెట్టుకోవడం తనకసలు నచ్చలేదు. అమ్మా నాన్నలు ముద్దుగా పెట్టుకునే ముద్దులా లేదది. తను భయపడి పెద్దగా ఏడుస్తూ శ్రీదర్ ఉంగరాల జుట్టును పిడికిళ్ళతో బిగించి పట్టి అతని తలని తన ముఖం నుంచి బలంగా తోసింది. తన భుజాల చుట్టూ ఉన్న అతని చేతులను గోళ్ళతో రక్కి బయటకి పరిగెత్తుకు వచ్చి అన్నయ్యతో ఈ విషయం చెప్పింది. విషయం

విన్న అన్నయ్య ఎర్రబడిన ముఖంతో కోపంగా శ్రీధర్‌ని లాగి చెంపపెట్టుపెట్టి తనని తమింట్లోకి లాక్కెళ్ళాడు. ఆ రోజు నుంచీ తనూ, అన్నయ్యా ఆ ఇంటివైపు వెళ్ళ లేదు. ఇప్పుడు ఇటిక్యాల వారి స్థలంలో పెద్ద దేవిడీలా ఉండే ఆనాటి ఇంటి స్థానంలో 'సత్యసదన్' అనే పెద్ద అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్ కనబడుతుంది. అప్పట్లో వాళ్ళ పెరడుగా ఉన్న స్థలంలో కొంతమేర అపార్ట్‌మెంట్లలో ఉంటూన్న పిల్లలు ఆడుకోవడానికి వీలుగా ప్లే ఏరియాగా మార్చారు.

అప్పట్లో ఆ ఇంటికి నైరుతి వైపున పెరిగి ఉన్న స్థలానికి వీధిపోటు తగిలేదని, ఆ స్థలాన్ని రోడ్డువైపు ప్రహరీగోడ కివతలగా వదిలి ఆ స్థలంలో చిన్న మండపాన్ని నిర్మించి వినాయకుడిని ప్రతిష్ఠించారు. ఇప్పుడా మండపాన్ని చిన్నపాటి గుడిలా మార్చారు. ఆ గుడిలో వినాయకుడితో పాటు సాయిబాబా పాల రాతి విగ్రహాన్ని కూడా ప్రతిష్ఠించారు. ఆ గుడి ముందు పైజామా, లాల్చీ, మెడపై నుండి జరీ కండువా వేసు కున్న ఓ వ్యక్తి నిలబడి ఉన్నాడు. ఒత్తైన అతని ఉంగరాల జుట్టు బాగా నెరసి ఉండి తీగలు చుట్టబెట్టినట్లుగా మెరుస్తుంది. చెవిలో పువ్వుతో, నుదుట విభూది అద్దుకొని భక్తిగా పూజారిచ్చిన హారతి కళ్ళకద్దుకుంటున్న ఆ వ్యక్తిపై రాధిక దృష్టి నిలిచింది. హారతి పళ్ళెంలో డబ్బులు వేసి అతను ఆ గుడికి ఇటువైపు ఫుట్‌పాత్‌పై వరుసగా కూర్చొని ఉన్న బిచ్చగాళ్ళకు ఆహారపు పొట్లాలు పంచసాగాడు. బాగా నెరిసినా కూడా ఒత్తైన ఉంగరాల జుట్టున్న ఆ వ్యక్తిని... ఎక్కడో చూసిన జ్ఞాప కం... ఎక్కడా... అతను... అతను... శ్రీధర్... అవును ముమ్మాటికీ అతనే... అప్పటి ఆ రాలుగాయి శ్రీధర్‌ని ఇప్పుడిలా భక్తిముద్రలో చూసిన రాధిక పెదాలపై చిరునవ్వు మెదిలింది. జ్ఞాపకాల వెల్లువలో మునిగి పోయిన రాధికని బయటికి తేవడానికన్నట్లుగా

"నానమ్మా ఇక వెళ్దామా" భుజం చుట్టూ చెయ్యి వేస్తూ అడిగింది 'శావీ'.

మనవరాలి మాటలతో ఈ లోకంలోకి వచ్చిన రాధిక మళ్ళీ ఒకసారి పరిసరాలను పరికించి చూసి వెళ్ళి కార్లో కూర్చుంది. కదులుతున్న కార్లోంచి తమ ఇంటికి నాలుగిళ్ళవతల ఉండే సంగీతం టీచరిల్లు వైపొకసారి కుతూహలంగా చూసింది. ఆనాడు బొమ్మ రిల్లులా ఉండే ఆ ఇంటికి బదులుగా అక్కడ నాలు గంతస్థుల మేడ కనిపించింది. అప్పట్లో ఆ ఇంటి వరం డాలో సంగీతం టీచరు దగ్గర రాధిక నేర్చుకున్న పాఠాలు గాలిలో తేలుతూ కారు అద్దాలను చీల్చుకొని ఆమె చెవులకు సోకినట్లుగా తోచింది.

స..రి..గ..మ..పద..నిస

సని..ద..ప..మ..గ..రిస

ఆరోహణ, అవరోహణ మూడో కాలంలో వేగంగా పాడటం. ఆపై కీర్తనలను ఆలాపించటం.

లంబోదర లకుమిక రా..

అంబాసుత...

అసంకల్పితంగా రాధిక పెదాలు పలికాయి

...అంబాసుత... అమర వినుత... లంబోదర..

లకుమికరా...

ఉన్నట్లుండి తియ్యటి తేనెలూరే కీర్తన వినబడ టంతో మొదట ఉలిక్కిపడ్డ శేఖర్, శావీలు అందులోని మాధుర్యాన్ని ఆస్వాదించసాగారు. రాధిక మరో చరణంలోకి వచ్చేసరికి ఆమె గొంతులోకి ఆయాసం తన్నుకు రావడంతో పాటు ఆగిపోయింది. శావీ కంగారుపడుతూ రాధిక కంఠంపై చెయ్యివేసి ముని వేళ్ళతో సున్నితంగా మర్దన చేసినట్లుగా అని "స్ట్రెయిన్

## నానీలు

**నా**కు తెలుసు
నీ అస్త్రమేమిటో..
సహనంతో ఎదురీత..
సమస్యల్ని ఛేదిస్తూ విజేత!

నా అసమర్థతను
నీ అసమాన ప్రతిభ
అర్థంగా మార్చిన వేళ
కృతజ్ఞతగా జోతలమాల!

నా కష్టాలూ
నీ నష్టాలూ కలిసి
'మనం'గా ఉపశమించితే
మైత్రికి నిర్వచనం!

నా ఇంకు పెన్నూ..
నీ బాల్‌పెన్నూ...
స్వరూపమేదైనా
కల'కలం' సృష్టించే గన్ను!

నాది అవిశ్రాంత పోరాటం..
నీది సుఖజీవనానికై ఆరాటం..
నీకు ప్రజాధనంపై గురి..
నాకు ప్రయో'జనమే' దారి!

-గుండాన జోగారావు

## నేను!

ఆశగా- వన్నెల్ని తెచ్చే వసంతం కోసం ఎదురు
చూస్తూ-
శిశిర కాలపు స్మృతుల చివుళ్ళ కోసం
కన్నీళ్ళను దోసిళ్ళ మోస్తూ-
నా సంతోషం గప్పు గప్పుమనే దీపం.
నిలకడలేని మనసును ఓదారుస్తూ
కందరాల నుండి ఓ అగ్నిశిఖ నేనొస్తానంటే
ఒడిని జోలపాడలేని అవిటితనం
దూరాన ఉంటేనే కదా చందమామ అందం!
మనిషికెన్ని రకాల భయాలు!
ఓల్గా - గంగల గురించి మాటాడే మనిషి
తనలోని మరో మనిషిని ఆలకించదేం?
సమాజాల సమానతల అస్తిత్వం ప్రశ్నించే మనిషి
స్తబ్ధత - సంకోచాలను మరచిపోతాడేం?
దోసిళ్ళ కన్నీళ్ళు పారిజాతాల్లా
నేల తల్లి పాదాలంటితే
ఒక్క పూవైనా పూయని
నా ఆశల వంక నిరాశగా చూస్తూ-
సహనం - సౌశీల్యం - త్యాగమనే త్రికోణపు
ఉచ్చుల్లో
ఆడ మనసును ఉరితీస్తుంటే
ఆశల పుప్పొడికి మరో జన్మలేదు - రాదు
కన్నీటి చుక్క ఉప్పదనంలో
ప్రేమనీ - స్నేహాన్నీ వెదుక్కునే
ఓ పిచ్చి మనసా!
నీకు నేనేమివ్వగలను?
పుట్టిన పాప పేరేదైతేనేం?
ప్రేమ నటిస్తూ-
అభద్రతా భయంతో చచ్చే మనిషిని వెక్కిరిస్తోంది
స్త్రీకి ఎంత స్వేచ్ఛ ఉన్నా-
ఆలింగనం తప్ప - ఆమె-?
నేనింకా కన్నీరు కారుస్తున్నానంటే
భావనా- చేతనా ఉన్న మనిషిని నేను

-మల్లీశ్వరి

అవకు నానమ్మా, రిలాక్స్..." మంచినీళ్ళు తాగుతావా."

కారు ముందు సీట్లో కూర్చున్న శేఖర్ వెనక్కి తిరిగి ఏమయ్యిందక్కా కారాపమంటావా?" కంగారుగా అడిగాడు.

వద్దన్నట్లుగా తల వూపింది.

అక్కా ఇంట్లో భోజనానికి అన్ని ఏర్పాట్లూ చేశారు..

అతని మాటలు పూర్తికాక మునుపే ఆమె

"వీలయినంత త్వరగా మనం ఊరు వెళ్ళాలి శేఖర్... వ్యవధి చాలా తక్కువగా... ఉంది... ఆమెకు గొంతులోకి మళ్ళీ ఆయాసం తన్నుకు వచ్చింది. మాట బరువుగా వచ్చింది.

ఏమిటక్కా ఎందుకట్లా అవుతూంది? ఒంట్లో బాగులేదా..? ఆమె ఆయాసాన్ని కనిపెట్టిన శేఖర్ కాస్త కంగారుగా అడిగాడు. అదేం లేదు డస్ట్ ఎలర్జీ వల్ల అలా అవుతూందంతే, టాబ్లెట్ వేసుకుంటే తగ్గి పోతుందిలే, మనం ఓ గంటన్నరలో ఊరు చేరుకుం టాం కదా, భోజనాలు అక్కడే చేద్దాం" అన్నది రాధిక.

ఇక చేసేదేం లేక శేఖర్ సరేనన్నట్లుగా తల ఊపి తన సెల్ ఫోన్‌లో ఊళ్ళో వాళ్ళకు తాము అక్కడికి చేరేసరికి భోజనం ఏర్పాట్లు చెయ్యమన్నాడు. డ్రైవరుతో కారుని ఊరు వైపు పోనివ్వమని చెప్పాడు.

○ ○ ○

కారు కంటే వేగంగా రాధిక మనసు ఆ ఊరు పరిసరాలను చేరుకొని ఆనాటి జ్ఞాపకాల కోసం వెతుక్కుంటూంది. సెలవుల్లో తను, అన్నయ్య అమ్మతో పాటు అమ్మమ్మ వాళ్ళ ఊరికి వెళ్ళేవాళ్ళు. ఊరు మొదట్లోనే ఎదురయ్యే తాటితోపులూ, వాటికవతల వరిపొలాలూ ఉండేవి. కాస్త ముందుకు వెళ్ళగానే దారి కిరువైపులా చెయ్యితో పేర్చినట్లుగా ఉన్న బొమ్మరిళ్ళ లాంటి ఇళ్ళు అక్కడొకటీ ఇక్కడొకటీ కనబడేవి. మట్టి రోడ్డుకు ఒకవైపు కాస్త దూరంలో తెల్ల తామరలతో నిండి ఉన్న చెరువు కనబడేది. ఊళ్ళోకి వెళ్ళగానే పెంకుటిళ్ళ మధ్యలో ఠీవిగా నిలబడి ఉన్న అమ్మమ్మగారి డాబా ఇల్లు కనబడేది. ఇళ్ళ మధ్యలో అక్కడక్కడా గుబురుగా పెరిగిన మామిడి, చింత, వేప చెట్లు ఉం డేవి. ఊరి మధ్యలో బడి, ఓపక్క గ్రంథాలయం ఉం డేవి. ఊళ్ళోకెల్లా ఆకర్షణీయంగా ఎత్తైన గోపురం గల రాములవారి గుడి ఉండేది. ఆ గోపురంపై నాలుగు వైపులా సింహం బొమ్మలు ఆ ఊరుని పర్యవేక్షిస్తున్నట్లుగా ఠీవిగా కూర్చుని ఉండేవి.

డాబా పైన మామయ్య ఒళ్ళో కూర్చొని ఇంటికి

ఎదురుగా అల్లంత దూరంలో కనిపించే ఆ గుడినీ, గుడి వెనకగా కనుచూపు మేర వరకూ పచ్చగా పరచు కొన్న పైర్లనీ, ఆ పైర్ల మీద నీలాకాశంలో ఎగురుతూ తిరుగాడే కొంగల బారులనీ కన్నుల పండుగలా చూస్తూ ఉండిపోయేది. పచ్చని పైర్లను సున్నితంగా స్పృశిస్తూ వచ్చే గాలి తెమ్మెరలను ఆస్వాదించడం తనకెంతో ఇష్టంగా ఉండేది. అమ్మ తనకూ అన్నయ్యకూ చింత కాయ పచ్చడీ, కమ్మని నెయ్యీ కలిపిన గోరుముద్దలు తినిపించేది. ఆపైన గడ్డపెరుగు కలిపిన అన్నం పెట్టేది. కడుపు నిండిపోయి ఇక చాలు తిననని మారాం చేస్తే గుడిపై ఉన్న సింహపు బొమ్మలను చూపి చూడు రాధీ అవి నిన్నే చూస్తున్నాయి... ఈ రెండు ముద్దలూ తిన కుంటే గాల్లో ఎగిరి వచ్చి నిన్నెత్తుకుపోతాయి అని అమ్మ చెప్పిన మాటలు ఆమె చెవుల్లో విన్పించినట్లుగా అన్పించడంతో ఈ లోకంలోకి వచ్చింది రాధిక. కదులుతూన్న కార్లోంచి పరిసరాలు గమనించింది. ఎక్కడున్నారో అర్థం కాలేదు.

"శేఖర్ ఇంకా ఎంత దూరం వెళ్ళాలి" అడిగింది.

"ఇదిగో మరో పావుగంటలో ఊరు చేరుకుంటాం" అన్నాడు.

రాధిక మనసు ఉద్వేగంతో నిండిపోయింది. తను పాతికేళ్ళ వయస్సున్నప్పుడు భర్తతో పాటుగా అమెరికా వెళ్ళి అక్కడే స్థిరపడింది. అమ్మ ఆఖరి ఘడియల్లో ఉందని తెలిసినప్పుడు వచ్చి వెళ్ళింతర్వాత మళ్ళీ ఇన్నేళ్ళకు తన చిన్ననాటి తీపి జ్ఞాపకాలను నెమరువేసు కోవాలనే ఆఖరి కోర్కెతో ఈ దేశంలో అడుగు పెట్టింది. బాల్యంలో తను తిరుగాడిన ఆ పల్లెలో ఆ ఇంట్లో తన కిష్టమైనవన్నీ తనివితీరా చూడాలనే తపనతో వచ్చింది. తనకున్న కొద్దిపాటి సమయాన్ని ఇక్కడి బంధువులతో కలిసి గడపాలనుకొని వచ్చింది.

కాన్సర్ బారిన పడి క్షీణిస్తున్న ఆమె ఆయుష్షను డాక్టర్లు పెంచగలిగే స్థితి దాటిపోయింది. బహుశా కొన్ని వారాలు లేదా రోజుల్లో ఆమె జీవితం ముగియ బోతుంది.

ఆమె "లాస్ట్ విష్" ఏదైనా ఉందా అని డాక్టర్లూ, స్నేహితులూ అడిగినప్పుడు మొదట రాధికకు ఏమీ తోచలేదు. జీవితంలో తను అనుకున్నవన్నీ సాధించింది. తనలో ఇంకా ఏం కోరిక మిగిలుంది అనుకోబోయింది.

కానీ ఆమె అంతరాంతరాలల్లో ఎక్కడో నిక్షిప్తమై ఉన్న ఈ కోరిక తుఫాను తాకిడికి ఉవ్వెత్తున ఎగిసిపడే అలలా బయటపడింది. ఇక క్షణమైనా ఆగలేనట్లుగా ఉన్నపళంగా బయలుదేరింది. ఆమెకు తోడుగా మనవరాలు 'శావీ' కూడా వచ్చింది. ఎప్పుడన్నా తీరిక వేళల్లో మనవరాలితో తన చిన్ననాటి ముచ్చట్లు పంచుకునేది. నాయనమ్మ మాటల ద్వారా చిరపరిచిత మైన ఊరూ, పల్లె, దేశం చూడాలన్న ఆసక్తి కలిగింది 'శావీ'కి. శేఖర్ అన్నట్లుగా ఓ పావుగంటలో ఊరు పొలిమేరకు వచ్చేశారు.

"అప్పట్లో రోడ్లు సరిగ్గా ఉండేవి కావు. ఇప్పుడు ఊళ్ళోకి వెళ్ళే వరకూ తారురోడ్డు వేశారక్కా" అన్నాడు శేఖర్.

రోడ్డు మలుపు వద్ద "నాచారం" అని ఊరిపేరు రాసి ఉన్న బోర్డు బాణం గుర్తు చూపుతూ ఉంది. కానీ అప్పట్లో ఆ మలుపు నుండి కనబడే చిక్కని తాటి తోపులేవీ... ఎక్కడ మాయమైనాయి...? రాధిక కళ్ళు నులుముకొని మరీ చూసింది. ఎక్కడా మచ్చుకి ఒక్క తాటి చెట్టు కూడా కనబడలేదు. తాటి చెట్లకు బదులుగా పెద్ద పెద్ద కోళ్ళఫారం షెడ్లు కనబడుతున్నాయి. వాటిని చూసి అయోమయంగా మారిన రాధిక ముఖకవళికల్ని గమనించినట్లుగా "అక్కా, ఈ మధ్యకాలంలో ఊరు బాగా మారిపోయింది. భూముల ధరలు విపరీతంగా పెరిగాయి. ఐదెకరాల భూమిగల వాళ్ళు కూడా నేడు కోటీశ్వరులయ్యారు. లోన్ తీసుకొని పౌల్ట్రీలు పెడుతు న్నారు. ఊరికి దగ్గర్లో సినిమా థియేటరు కూడా వచ్చింది" శేఖర్ మాట్లాడుతూండగానే ఊళ్ళోకి వచ్చే శారు.

ఆనాడు ఊళ్ళో ఇళ్ళు అక్కడక్కడ 'చెయ్యి'తో పేర్చి నట్టుగా కనబడేవి. ఇప్పుడు చిందర వందరగా ఎక్కడ బడితే అక్కడ కట్టిన కొత్త ఇళ్ళు ఎన్నో కనబడుతున్నాయి. అప్పట్లో ఇళ్ళ మధ్యలో అక్కడక్కడా కనబడే చెట్లకు బదులు నేడు కరెంటు స్తంభాలూ, టీవీ ఆంటెనాలు కనబడుతున్నాయి. కారు ఆగింది. రాధిక మేనమామ కొడుకు రాఘవ వీళ్ళను ఇంట్లోకి సాదరంగా ఆహ్వానిం చాడు. ఆ ఊరులాగానే ఇంట్లోనూ ఎన్నో మార్పులు వచ్చాయి. ఆ రోజుల్లో ఆ ఇల్లు ఒక్కటిగా ఉండేది. రాధిక మేనమామకు నలుగురు అబ్బాయిలు. ఇప్పుడా ఇల్లు నాలుగు భాగాలుగా చీలింది. గదులకు అటాచ్డ్ బాత్‌రూంలు కట్టించుకున్నారు. ఏర్ కండీషన్లు, డిష్ ఆంటినా ఏర్పాటు చేసుకున్నారు. ప్రైవసీ కోసం ప్రహరీగోడ, డాబా పిట్టగోడల ఎత్తు పెంచారు. తాతయ్య ఎప్పుడూ కూర్చునే ఇంటి ముందున్న వేపచెట్టు కింద అరుగును తీసి చదునుచేసి ఆ స్థలంలో గ్రానైట్

పలుకలు పలిచారు. అది చూసి ఆమె అప్రయత్నంగా 'అయ్యో' అన్నది.

"ఏమిటి వదినా" అడిగాడు రాఘవ.

అక్కడ అరుగు ఉండేది. తాతయ్య దానిపై కూర్చొని ఊళ్ళోవాళ్ళ పంచాయతీలను విని తీర్పు చెప్పేవాడు. రాధిక ఆయన పక్కన రాణీలా ఠీవిగా కూర్చునేది. అటువైపు నుండి పనుల కోసం వెళ్ళే ఊళ్ళో వాళ్ళ పిల్లలు ఆమెవైపు కుతూహలంగా, ఒకింత అసూయగా చూసేవాళ్ళు.

అదే విషయం రాఘవకు గుర్తు చేసిందామె.

"అవన్నీ ఇప్పుడేమీ లేవొదినా. పంచాయతీలూ, పేచీలూ ఎన్ని ఉన్నా తీర్పు చెప్పడాలూ, ఆనాటిలా ఓ పెద్దమనిషి మాటకు విలువ నివ్వటాలూ ఇప్పుడవేవీ లేవు" అన్నాడు తేలిగ్గా నవ్వేస్తూ.

ఆ తర్వాత భోజనాలకు పిల్చారు. డైనింగ్ టేబుల్‌పై ఎన్నో వంటకాలు పెట్టి ఉన్నా ఆమె వాటిల్లో దేనికోసమో ఆత్రంగా వెదకసాగింది.

"ఏమిటక్కా, ఏం కావాలీ...? అడిగింది రాఘవ భార్య నీరజ.

చింతకాయ పచ్చడీ... నెయ్యీ కోసం... చూస్తున్నాను" అన్నది.

"ఓ.. అదా.. చింతకాయ చెక్కు తీయడం.. ఉప్పువేసి రుబ్బడం, పండు మిరపకాయలు తెచ్చి వాటిని వేరుగా రుబ్బి రెండింటినీ కలియబెట్టడానికి మరోసారి నూరడం... బాబోయ్- ఆ పని తలుచుకుంటేనే భయం వేస్తుందక్కా. అంత కష్టపడి చేసిన ఆ పచ్చడి అప్పట్లా నిలువ ఉండటం లేదు. వారం తిరిగేసరిగి బూజుపట్టి పాడైపోతుంది. పడ్డ శ్రమంతా బూడిదలో పోసిన పన్నీరవుతూండడంతో ఇప్పుడు చేయడమే లేదక్కా ఇక నెయ్యి సంగతంటావా కొలెస్ట్రాల్ హెచ్చుతుందేమోనన్న భయంతో మేమంతా నెయ్యికి దూరంగా ఉంటున్నాం. పిల్లలు పట్నాల్లో ఉండి అలాంటి విషయాలే మరిచారు" అన్నది.

ఆ మాటలతో చింతకాయ పచ్చడి తినాలన్న తన జిహ్వా చాపల్యాన్ని బలవంతంగా అణచుకొని ఏదో కాస్త తిన్నాననిపించి మేడపైకి వెళ్ళింది. డాబాపై నిల్చొని తనకిష్టమైన దృశ్యం కోసం కళ్ళు విప్పార్చి మరీ చూసింది. కానీ అక్కడా ఆమెకు నిరాశే ఎదురయ్యింది. ఎప్పుడూ కళకళలాడుతూ ఉండే గుడి పాడుబడ్డట్టుగా అయ్యింది. రంగు వెలసిన సింహాలు ఆమె వైపు జాలిగా, దీనంగా చూస్తూ మా అధోగతి చూడమన్నట్లుగా తనతో మొరపెట్టుకుంటున్నట్లుగా అన్పించింది రాధికకు. గుడి వెనకగా కనిపించే పచ్చని పొలాలు ఎక్కడ మాయమైనాయో అక్కడ అడ్డదిడ్డంగా కట్టిన ఇళ్ళు కనబడుతున్నాయి. చల్లటి పైరగాలి మోసుకువచ్చే ధ్వజస్తంభపు చిరుగంటల సవ్వడికి బదులుగా గుడి గోపురంపై అమర్చిన మైకులో నుండి గందరగోళంగా ఏవో భక్తిగీతాలు వినబడుతున్నాయి. రాధికకు అక్కడ ఒక్క క్షణం నిలవాలన్పించలేదు. చటుక్కున కిందికి వెళ్ళింది.

నాయనమ్మనే గమనిస్తున్న 'శావి' ఆమె మనఃస్థితిని అంచనా వేయగలిగింది. ఓదార్పుగా రాధిక భుజం చుట్టూ చేయి వేసి పడక గదిలోకి తీసుకువెళ్ళింది. "నానమ్మా మీరు బాగా అలసిపోయారు, కాసేపు విశ్రాంతి తీసుకోండి" అంటూ ఏవో టాబ్లెట్లు ఇచ్చి మంచినీళ్ళు తాగించింది. నిరాశ పేరుకుపోయి భారంగా మారిన రాధిక హృదయం, ప్రయాణంలో అలసిన శరీరం మనవరాలి సపర్యలతో కాస్త తెప్పరిల్లాయి.

'శావి' ఇచ్చిన ట్రాంక్విలైజర్స్ ఆమె కళ్ళ మీదికి నిద్ర నాహ్వానించాయి.

రాధిక నిద్రలోకి జారుకోగానే 'శావి' తన హ్యాండ్ బ్యాగేజీలోంచి ల్యాప్‌టాప్, వీడియో కెమెరాలు బయటకు తీసింది. కొద్ది క్షణాలపాటు తీవ్రంగా ఆలోచించింది. వీడియో కెమెరా చేతిలోకి తీసుకొని గది బయటకు వెళ్ళి రాఘవతో ఏదో మాట్లాడింది. ఆ తరువాత ఇద్దరూ కలిసి ఊళ్ళోకి వెళ్ళారు. ఇద్దరూ తిరిగి ఇల్లు చేరేసరికి చీకటి పడింది. 'శావి' తన ల్యాప్‌టాప్ ముందు కూర్చొని కొన్ని గంటలపాటు దీక్షగా ఏదో పనిలో నిమగ్నమయ్యింది. పని పూర్తయ్యాక అలసటతో మంచంపై ఒరిగింది. బాగా అలిసిన ఆమె క్షణంలో నిద్రలోకి జారుకుంది.

○ ○ ○

రాధికకు మెలకువ వచ్చేసరికి తూర్పు తెల్లవారింది. ఆమె నెమ్మదిగా మంచంపై నుండి లేచి బాత్‌రూం వైపు వెళ్ళబోతూ పక్కనే ఉన్న మరో మంచంపై నిద్రపోతున్న మనవరాలి వంక చూసింది. మంచులో తడిసిన నందివర్ధనంలా ఉన్న 'శావి' ముద్దుల మోము పైకి జారిన ముంగురులని సున్నితంగా పైకి జరిపింది. 'శావి'ని అందరూ తన పోలికే అంటారు. ఎదురుగా ఉన్న నిలువుటద్దంలో తన ప్రతిబింబాన్ని చూసుకుంది. వార్ధక్యం కారణంగా ముడతలు పడ్డ శరీరం, లోతుకు

పోయిన కళ్ళు, అనారోగ్యం వల్ల కళ్ళ చుట్టూ ఏర్పడ్డ నల్లటి వలయాలు, కాస్త వంగిన భుజాలతో ఒకింత వికృతంగా కనబడుతున్న నేటి రూపానికీ, అందాలు రాశిపోసినట్లుగా ఉండే ఆనాటి తన ముగ్ధ మనోహర మైన రూపానికీ సామ్యమెక్కడ ఉంది. వయసు పెరుగు దలతో పాటుగా శరీరానికి కలిగే ఈ మార్పులెంత సహజమో పల్లెకు గానీ పట్నానికి గానీ దేశానికి గానీ అంతే సహజం కదా! మరి ఈ మార్పును తనెందుకు జీర్ణించుకోలేకపోతుంది. కాకపోతే కాలగమనంలో వయసు పెరిగినకొద్దీ శరీరం శిథిలమవుతుంది. మర ణం సంభవించి నిర్జీవమవుతుంది. ఆపై గుప్పెడు బూడిదగా మారుతుంది. ఆ బూడిద ప్రకృతిలో కలిసి కనుమరుగవుతుంది. కానీ కాలగమనంలో ఏ ప్రదేశ మైనా అభివృద్ధి చెందుతుంది. అభివృద్ధి కనుగుణంగా ఆ ప్రాంతం స్వరూపం మార్పు చెందుతుంది. ఇక్కడ అభివృద్ధి చెందడమే గానీ అంతరించడం అన్నది ఉండదు. ఏదైనా ప్రళయం లాంటిది ముంచుకొస్తే తప్ప...

ఆనాటి మనుషులంతా మట్టిలో కలిసిపోయారు. తాతయ్యా, అమ్మమ్మా, అమ్మ, నాన్నా... ఏరీ వీళ్ళం తా... కాలగమనంతో పాటు ప్రాంతాల స్వరూపాలు, జీవన విధానాలు మారాయి. పాతతరం అంతరిం చింది, కొత్తతరం అవతరించింది. తిరిగే కాలచక్రంలో ఈ మార్పులు అతి సహజం కదా...! ఇదంతా తెలిసి కూడా తన మనసెందుకింత నిరాశకు గురయ్యింది. ఎంతుకింత వేదన పడుతూంది. వృత్తిరీత్యా తనో డాక్టరు. ఎంతోమంది రోగులకు వైద్యంచేసి వాళ్ళను శారీరకంగా, మానసికంగా కోలుకునేటట్లు చేసింది. తన దగ్గరకు చికిత్స కోసం వచ్చిన ఏ రోగీ అసంతృప్తితో వెళ్ళలేదు. కానీ తనేమిటో నేడిలా అయిపోయింది...? ఇన్నాళ్ళూ తన వృత్తిధర్మంలో క్షణం తీరిక లేని బిజీలైఫ్ గడిపిన తను నేడిలా పాత జ్ఞాపకాల కోసం వెంపర్లా డుతూ తనకు మిగిలిన కొన్ని ఘడియల జీవితాన్ని దుర్భరం చేసుకుంటూందెందుకు...? తన చివరి కోర్కెని పక్కన పెట్టి ఈ ఆఖరి ఘడియలు అందరితో కలిసి ప్రశాంతంగా గడుపవచ్చు కదా..!

రాధిక దృఢ నిశ్చయానికి వచ్చినట్లుగా ఒక్కసారి తల విదిలించుకొని తన మనసుని ముల్లులా తొలుస్తున్న లాస్ట్ విష్‌ని పారద్రోలే ప్రయత్నం చేసింది... ఉహూ... అది సాధ్యం కాలేదు.

రాధికకు అవసాన దశలో ఉన్నప్పటి తన తల్లి

## మా'నవతరమా' మేలుకో!

సరిగ్గా చెప్పాలంటే-
నేడు స్వార్థతంత్ర దినం!
నానాటికీ మాలో 'వేషభక్తి' పెరిగిపోతోంది
దేశభక్తి అనుకునేరు - పొరపాటు!
ద్వేషభక్తి అనుకున్నా పరవాలేదు.
మేమెంత ఎత్తుకు ఎదిగామో తెలుసా?
మా వ్యక్తిత్వంలో ఉన్నతి
హైహీల్స్ చెప్పుల్లో కన్పించట్లేదా మీకు
మా అందమంతా...
ఉల్లి పొరల్లాంటి వస్త్రాల్లో ఉంటుంది,
తొడలు కన్పించేట్లు తొడిగిన
చిరిగిన దుస్తుల్లో కన్పిస్తుంది
మనస్సుల్లో అనుకునేరు!
చూశారా! ప్రతి 'హృదయం' పారదర్శకమే!
జనరేషన్ ఎం..త ఫాస్టయ్యిందంటే
పుట్టిన వెంటనే బిడ్డ
ఇంగ్లీషులో 'కేర్, కేర్' మంటోంది
అందుకే - 'బేబీ కేర్....' వెలసింది!
నేడు మేమంతా ప్రపంచాన్ని గుప్పిట్లో తీసుకున్నాం!
దశదిశలా... ఇంటర్‌నెట్ సౌకర్యం-
ఆ మూలన... అమెరికాలో ఉన్న మా అన్నయ్యతో
ఇంటి ముంగిట్లో కూర్చొని మాట్లాడుతున్నాం
కాని హృదయం 'డబ్బు..డబ్బు' అని కొట్టుకుంటోంది!
ప్రపంచాన్నే గుప్పిట్లో తీసుకున్నప్పుడు
గుండె గొంతుక ఎలా వినబడుతుంది?
ఇది, జస్ట్ కమ్యూనికేషన్ గ్యాప్!
బ్లాక్‌హోల్ థియరీ తెలిసే ఉంటుంది మీకు
'మ్యాన్ హోల్స్' థియరీ అంతే!!!
కాలగర్భంలో అన్నీ కలసిపోవాల్సిందే
మనిషైనా, మహాపదార్థమైనా!
చూశారా! సైంటిఫిక్‌గా ఎలా సమర్థిస్తామో
'స్వ'రాజనీతి శాస్త్రం గుట్టేమీ విప్పట్లేదు
ఎన్ని 'డిస్కవరీ'లు... ఎన్ని శోధనలూ
'ఆత్మశోధన'లు అనుకునేరు!
మేము సైన్సు గురించి మాట్లాడుతున్నాం
సెన్సు గురించి కాదు.
మేము అందనంత ఎత్తుకు ఎదిగిపోయాం!
స్పేస్‌లో కూడా... స్పేస్ లేదు!!
మేము మాట్లాడేది అంతరాళం గురించి
అంతరంగం గురించి కాదు
మాదంతా నవతరం - మానవతరం అనుకునేరు!
మా నినాదం వందేమాతరం కాదు -
'వంద'యే మాతరం!

**-పింగళి గంగాధర్‌రావు (మనస్వి)**

జ్ఞప్తికి వచ్చింది. అమెరికా నుండి వచ్చిన తననీ, అన్నయ్యనీ చూడగానే మరణశయ్యపై ఉన్న సావిత్రమ్మ కళ్ళలో తళుక్కున మెరిసిన మెరుపు, ప్రాణం పోయే ముందు తన కన్నపిల్లల్ని చూసుకున్నానన్న సంతృప్తి ఆమెలో తను గమనించగలిగింది. బహుశా తమని చూడాలన్నదే అమ్మ ఆఖరి కోర్కె కావచ్చు. అందుకే అంత సంతృప్తితో వెళ్ళిపోయింది. కానీ నేడు తన విషయం అందుకు భిన్నంగా ఉంది. పోయే ప్రాణాన్ని ఉగ్గబట్టుకొని ఎంతో ప్రయాస పడుతూ ఈ దేశానికి వచ్చిన తనకు అసంతృప్తే... మిగిలింది... ఇలా అంతర్మథనంతో కొట్టుమిట్టాడుతున్న రాధికకు 'నానమ్మా' అన్న 'శావి' పిలుపు వినబడింది.

"నానమ్మా మీకో సర్‌ప్రైజింగ్ విషయం చూపిస్తాను ఇలా రండి" 'శావి' కంఠంలో చెప్పలేనంత ఉద్వేగం ధ్వనిస్తూంది. ఆమె రాధికను తీసుకెళ్ళి కుర్చీలో కూర్చో బెట్టింది. ల్యాప్‌టాప్‌లోని సిడి ప్లే చేసింది. స్క్రీన్ పైన దృశ్యాలు కదులుతున్నాయి. సౌండ్ ఎఫెక్ట్ కూడా ఉంది.

మొదట నీలాకాశంలో తెల్లని కొంగల బారులు కనిపించాయి. ఆ తర్వాత పచ్చని పొలాల కవతలి పక్క తాటితోపులు కనబడుతున్నాయి.

తన స్మృతి పథంలోని దృశ్యాల్ని స్క్రీన్‌పై చూస్తున్న రాధిక కళ్ళు ఆశ్చర్యంతో విచ్చుకున్నాయి.

మరో దృశ్యం మారింది. పచ్చని పొలాలకు ఇవతలి వైపు గుడి గోపురం, ఆ గోపురంపై పసుపు పచ్చని రంగులో మెరిసిపోతూ, ఎర్రని నోరూ, తెల్లని కోరలు కలిగిన సింహపు బొమ్మలు కూర్చొని వున్నాయి. వాటి కళ్ళు మిలమిలా మెరుస్తూ సజీవంగా కనబడుతున్నాయి. ఆ తర్వాత డాబా పైన ఒక తల్లి ఇద్దరు చిన్నారులకు గోరుముద్దలు తినిపిస్తూ గుడివైపు చూపుతోంది. ఆ స్త్రీలో అమ్మ పోలికలూ, ఆ పిల్లల్లో తనవీ, అన్నయ్యవీ పోలికలు స్పష్టంగా ఏర్పడుతున్నాయి. ఆ దృశ్యాలు చూస్తున్న రాధిక గుండెలో విచిత్రమైన అనుభూతి... ఆ దృశ్యాల్లో తన మనమరాలి సృజనాత్మకతను శ్రమనూ కూడ చూడగలుగుతూంది రాధిక.

కంప్యూటర్ స్క్రీన్‌పైన ఆ దృశ్యమాలికను చూస్తున్న శేఖర్, రాఘవ, నీరజ... అందరూ అదేదో అద్భుతాన్ని చూస్తున్నట్లుగా ఉండిపోయారు. "ఇదెట్లా సాధ్యం" రాఘవ భార్య నీరజ అడిగింది అమాయకంగా.

'శావి' వివరించసాగింది. "నానమ్మ, తన చిన్ననాటి విషయాలన్నీ నాతో కథలు కథలుగా కళ్ళకు కట్టినట్లుగా చెప్పేది. నానమ్మ వాళ్ళ చిన్ననాటి ఫోటోలు రాఘవ తాతయ్య నడిగి తీసుకున్నాను. వీడియో కెమెరాతో గుడినీ, ఊరి బయట అక్కడక్కడా ఉన్న పొలాలనీ, అరకొరగా మిగిలిన తాటిచెట్లనీ అన్నింటినీ విడివిడిగా షాట్స్ తీసాను. వాటినన్నిటినీ కలుపుతూ ఇలా కంపోజ్ చేసాను. కంప్యూటర్ కంపోజింగ్‌లో రంగు వెలిసిన గుడికి కొత్త రంగులు పులిమాను. ఆడియో రికార్డింగ్ ద్వారా సౌండ్ ఎఫెక్ట్ వచ్చింది.

వాళ్ళంతా శావి చెప్పేది శ్రద్ధగా వింటున్నారు. రాధికకు మాత్రం తను చిన్నతనంలో అమ్మ చెప్పిన రామాయణంలోని కథ గుర్తుకు వచ్చింది. చిన్నారి రాముడు ఆకాశంలోని చంద్రుడు కావాలని మారాం చేస్తే కైకేయి అద్దంలో చంద్రుని ప్రతిబింబాన్ని చూపిం దట. ఆ ప్రతిబింబాన్ని చూసి రాముడు ఆకాశంలోని అసలు చంద్రుడినే అందుకున్నానని మురిసిపోతూ కేరింతలు కొట్టాడట.

ఆనాడు కైకేయి రామునికి అద్దంలో చంద్రుని ప్రతిబింబాన్ని చూపి నిజమైన చంద్రునిగా భ్రాంతి కలిగించి పసివాని కోరిక తీర్చినట్లే రాధికకు మనమరాలు గత స్మృతులను దృశ్యమాలిక ద్వారా చూపగలిగింది. రాధిక ముఖం అనిర్వచనీయమైన ఆనందంతో వెలిగి పోతూంది. పెదవులపై సంతృప్తితో కూడిన చిరునవ్వు మెరిసింది. ఇక్కడ రాధిక 'లాస్ట్‌విష్' నెరవేరిందో లేదోనన్న విషయం కంటే నాయనమ్మ ఆఖరి కోర్కెను తీర్చాలన్న 'శావి' లేత మనసులోని తపనే రాధికలోని అసంతృప్తిని తొలగించింది.

రాధిక మనమరాలు సావిత్రిని దగ్గరకు తీసుకొని నుదుటిపై ముద్దు పెట్టుకుంది. తను చేసిన పని పట్ల నాయనమ్మ మనసులో కలిగిన అపురూపమైన భావాన్ని ఆ ముద్దులో గ్రహించగలిగింది 'శావి'. ఆప్యాయంగా మనవరాల్ని చుట్టివేసిన రాధిక చేతులు అచేతనంగా వాలిపొయ్యాయి. 'శావి'కి నాయనమ్మ పరిస్థితి అర్థ మయ్యింది. "షి ఈజ్ నో మోర్."

ఈ దేశానికి వచ్చేముందు రాధిక 'పవన్' 'శావి'లతో ఒట్టు వేయించుకుంది. ఇక్కడి బంధువులతో తన అనారోగ్య విషయం తెలుపవద్దని. తనిక్కడ వాళ్ళతో సరదాగా గడపాలనుకుందే గానీ వాళ్ళ కళ్ళలో దుః ఖాన్ని చూడడానికి కాదు. ఇక ఇప్పుడు ఆమె ఏదీ చూడలేదు. 'శావి' నీళ్ళు నిండిన కళ్ళతో అందరి వంకా చూస్తూ విషయం చెప్పడానికి ఉద్యుక్తురాలైంది. ■